క్లుప్తంగా

నేడు 'మీ కోసం'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ఆర్థిక సమస్యలతో తల్లడిల్లిపోతున్న వృద్ధ దంపతులు గాడి అప్పలనాయుడు, కొండాలమ్మ దంపతులకు రావి ఫణి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఆ దంపతులకు జీవనం కష్టంగా మారడంతో రావి యువసేన ద్వారా తెలుసుకున్న ఫణి రూ.11 వేల నగదును వారి ఇంటికి వెళ్లి అందజేశారు. యువసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు మెట్టగుట్ట వద్ద గిరి ప్రదక్షిణ

మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసమూర్తి గిరి ప్రదక్షిణ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి గిరి ప్రదక్షిణ, అనంతరం రాఖీ పౌర్ణమి వేడుకలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తారు.

ఆంజనేయస్వామి సన్నిధికి పాదయాత్ర

గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి మేడూరు వీరాంజనేయ స్వామి ఆలయం వరకు సోమవారం పౌర్ణమి సందర్భంగా వీరాంజనేయస్వామి భక్త బృందంచే ఉదయం 6 గంటల నుంచి పాదయాత్ర నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

మైలవరం: మైలవరం రాజాపేటలోని కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం బాలా త్రిపుర సుందరి శ్రీచక్రం, ఏకాంబరేశ్వరస్వామి, సిద్ధ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, జంట నాగులు, కాలభైరవ, నవగ్రహాల దివ్య ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని దేవస్థాన కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. బ్రహ్మశ్రీ మొగిలిచర్ల రవిశాస్త్రి, ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ దుర్గాప్రసాద్ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు.

ఈ-క్రాప్ నమోదు

వెల్వాడం(మైలవరం): వెల్వాడం గ్రామంలోని పొలాల్లో ఆదివారం ఈ-క్రాప్ నమోదు చేశారు. వెల్వాడం సచివాలయ వ్యవసాయాధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు ప్రయోజనాలను వివరించారు. కౌలు రైతులు ఎవరైతే సాగు చేస్తున్నారో ఆ వివరాలు, తగిన సమాచారం రెవెన్యూ శాఖ అధికారులకు అందించి కౌలు కార్డు తీసుకోవాలని చెప్పారు. కౌలు కార్డు 3 నుంచి 11 నెలల వరకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు.

రేపటి నుంచి పశువులకు టీకాలు

తిరువూరు: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలలను ఈనెల 20వ తేదీన మల్లేలలో ప్రారంభిస్తామని తిరువూరు మండల పశువైద్యురాలు శ్వేత తెలిపారు. సెప్టెంబరు 18 వరకు ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి గ్రామాల వారీగా టీకాలు వేస్తామని వివరించారు.

చెరువులకు జలకళ



నీటితో కళకళలాడుతున్న గంపలగూడెం నల్లచెరువు



నిండుకుండలా చింతలపాడు చెరువు

- వర్షాలతో నిండిన చెరువులు
- సాగు పనులు ముమ్మరం చేసిన రైతులు

గంపలగూడెం: ఇటీవల మండలంలో, ఎగువ తెలంగాణ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు నీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో చివరిది, తెలంగాణ సరిహద్దుగా ఉన్న గంపలగూడెం మండలంలో వ్యవసాయ భూములకు నీరు అందించేందుకు, పశుపక్ష్యాదులకు మంచినీటి వసతి కల్పించేందుకు మొత్తం 46 చెరువులు ఉన్నాయి. వీటిలో మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందినవి 13 చెరువులు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 33 చెరువులు ఉన్నాయి. వీటితోపాటు వినగడప, తునికిపాడుల్లో రెండు ఆనకట్టలు ఉన్నాయి. మెట్ట ప్రాంతమైన ఈ మండలంలో ఎక్కువ గ్రామాల్లో పైర్ల సాగు చెరువులపైనే కొనసాగుతోంది.

సాగు పనులు ముమ్మరం..

చెరువుల్లో నీరు చేరడంతో రైతులు వరి, పత్తి పైర్ల సాగును ముమ్మురం చేశారు. వీటితోపాటుగా మండలంలోని ప్రధాన నీటివనరులైన కట్టిలేరు, అనురాధ వాగుల్లో సైతం నెల రోజులుగా నీటి ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. వీటి కింద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల ద్వారా నీరు సంవృద్ధిగా సరఫరా అయి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల కింద వ్యవసాయ భూముల్లో సాగుకు అవకాశం ఏర్పడింది. సెప్టెంబర్ నెలలో కూడా సంవృద్ధిగా వర్షాలు పడితే ఈ ఏడాది రైతుల నీటి కష్టాలు తీరుతాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యాముల్లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఆయా డ్యాముల్లో నీరు నిండిన పరిస్థితి ఈ ఏడాది ఇప్పటికే ఏర్పడింది. రెండు డ్యాముల నుంచి పంట కాలువల ద్వారా పైర్లకు సాగునీరు సరఫరా అయ్యే అవకాశం ఉంది. సాగర్ రెండు, మూడు జోన్ల పరిధిలోని గంపలగూడెం మండలానికి కాలువల ద్వారా నీరు సరఫరా కాబడి అవసర సమయాల్లో సాగు నీరు అందుతుంది. చెరువులు నిండి ఉండటం, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుంచి సాగునీరు ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ధైర్యంగా పైర్ల సాగు చేపట్టారు.

కొఠారి నరసింహారావుకు నివాళి



మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి

నూజివీడు: అసంఘటిత రంగ కార్మికులను ఐక్యం చేసి వారి హక్కుల సాధనకు సంఘాలను నిర్మించిన కార్మిక నేత కొఠారి నరసింహారావు అని వక్తలు కొనియాడారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు దివంగత కొఠారి నరసింహారావు వర్ధంతి కార్యక్రమం ఆదివారం పట్టణంలోని కార్మిక భవన్‌లో నూజివీడు ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి. రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర హమాలి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు తదితరులు నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కొఠారి నరసింహారావు స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని చెప్పారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, కొఠారి నరసింహారావు సతీమణి రాజ్యలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

రుణభారంతో కౌలు రైతు ఆత్మహత్య



కౌలురైతు చిన్నికృష్ణ (ఫైల్)

గంపలగూడెం(తిరువూరు): మండలంలోని అనుముల్లంకకు చెందిన కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టిబొమ్మ చిన్నికృష్ణ (54)కు రెండు ఎకరాల సొంత పొలం ఉంది. మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఏడాది కాలంగా పంటలు చేతికందక సాగులో నష్టాలు చవిచూస్తున్న చిన్నికృష్ణకు రూ.15 లక్షలకు పైగా అప్పులున్నాయి. రుణభారం తీరే మార్గం కనిపించక ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పత్తి చేలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీప రైతులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు చిన్నికృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు.

మహారాజ్ గౌడ్ విగ్రహావిష్కరణ

చాట్రాయి: సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ గౌడ్ ఆశయాలను కాపాడుకుందామని జై గౌడ సేన రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సంగెడ్డ రంగారావు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తుమ్మగూడెంలో మహారాజ్ గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 360 ఏళ్ల కిందట తెలంగాణ గడ్డపై బహుజనులు, గౌడ కులస్తుల హక్కుల కోసం మొగల్‌ల నిరంకుశ పాలనపై పోరాడిన వ్యక్తి మహారాజ్ గౌడ్ అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కాసాని గాంగేయుడు, పానుగంటి శివన్నారాయణ, కందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యిమందికి వైద్య సేవలు

తిరువూరు: మధుమేహం, రక్తపోటు రావడానికి ఆహారపు అలవాట్లే కారణమని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక నాగార్జున స్కూల్ ఆవరణలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మధుమేహ వైద్యశిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్, ఖమ్మం, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వెయ్యి మంది రోగులు శిబిరానికి విచ్చేసి వైద్యసేవలు పొందారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పర్యవేక్షించారు.

27 నుంచి ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర

తిరువూరు: తిరువూరు నియోజకవర్గానికి కృష్ణా జలాలు సరఫరా చేయాలని కోరుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో అధికశాతం గిరిజనులు కిడ్నీవ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పాదయాత్రతో కిడ్నీబాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో పాటు రక్షిత మంచినీరందించడానికి అన్ని పక్షాలూ కలిసి రావాలని కోరారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

తిరువూరు: పేద విద్యార్థులకు తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. స్థానిక ఐడియాస్ సేవా సంస్థ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు వీటిని విద్యార్థులకు అందజేశారు. ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాఖీ పండుగ సందడి

ముసునూరు: అన్నా-చెల్లెళ్లు, అక్కా-తమ్ముళ్ల చక్కనైన అనుబంధానికి ప్రతీకగా సంప్రదాయంగా జరుపుకుంటున్న రాఖీ పండుగ సందడి మండలంలో నెలకొంది. సోమవారం రాఖీ పర్వదినం సందర్భంగా ఆదివారం ముసునూరు, చెక్కపల్లి, గోపవరం, రమణక్కపేట, వేల్పుచర్ల, కాట్రేనిపాడు తదితర గ్రామాల్లో షాపులు ఏర్పాటు చేసి రాఖీల విక్రయాలు నిర్వహిస్తున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో దుకాణాల వద్దకు చేరుకుని రాఖీలు, స్వీట్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మండలం అంతటా రాఖీ పండుగ సందడి నెలకొంది.

వరి, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వ్యవసాయాధికారి సాయిశ్రీ

గంపలగూడెం: ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో అప్పటికే సాగుపూర్తి చేసిన వరి, పత్తి రైతులు పైర్లను కాపాడుకునేందుకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గంపలగూడెం మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ అన్నారు. భారీ వర్షాలకు వరి పొలాలు వరదనీటి ముంపునకు గురయ్యాయని, పత్తిచేలలో అధిక తేమశాతం ఏర్పడిందని చెప్పారు. కట్టిలేరు, గుర్రపువాగు, మొగిళ్లవాగు, అనురాధ వాగు, ఊటుకూరు, కొణిజెర్ల వాగుల వెంట పరీవాహక ప్రాంతంలో కొంత విస్తీర్ణం మేర వరిపైరు మునక వేసిందన్నారు. సంబంధిత రైతులు ప్రస్తుతం వాతావరణం కొంతమేర తెరపిచ్చిన నేపథ్యంలో పొలంలో నీరు వెళ్లగొట్టాలన్నారు. అనంతరం ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌లను అదనంగా వేసుకోవాలన్నారు. అధిక వర్షంతో పత్తిచేలలో నేలలో తేమశాతం ఎక్కువ ఉండటం వలన ఎక్కడైనా మొక్కలు ఎండిపోతున్నాయా? అని పరిశీలించాలన్నారు. ఎండుతున్న చెట్ల వద్ద ఒక లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండిజమ్ 1 గ్రాము కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు మొక్క అడుగుభాగం తడిసేలా పిచికారీ చేయాలని చెప్పారు. నీటిలో కరిగే 19-19-19 లేదా మల్టీకే (13-0-45) 3 గ్రాములు చొప్పున లేదా యూరియా 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారీ చేయాలన్నారు. పై పద్ధతులు పాటించడం ద్వారా వరి, పత్తి పైర్లను నష్టపోకుండా జాగ్రత్తపడాలని వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

384 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

పెద్దకొమిర(గంపలగూడెం): గంజాయి, మద్యం అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా తిరువూరు సెబ్ అధికారులు ఆదివారం తెల్లవారుజామున గంపలగూడెం మండలం పెద్దకొమిరలో వాహనాలు తనిఖీ చేశారు. మైలవరానికి చెందిన మోదుగు జయరామ్‌ప్రసాద్, షేక్ మాకతున్ కారులో తెలంగాణకు చెందిన 384 మద్యం సీసాలతో వెళుతుండగా పట్టుకున్నారు. మద్యం సీసాలను, కారును స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ పి. అశోక్ తెలిపారు.

నిందితులకు కౌన్సెలింగ్

గంజాయి, సారా నియంత్రణలో భాగంగా గతంలో మద్యం విక్రయిస్తూ పట్టుబడి కేసుల్లో ఉన్న పెద్దకొమిరకు చెందిన పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం అక్రమ రవాణా, చట్టరీత్యా చర్యలను అధికారులు వివరించారు. వారిచే ఇకపై సారా విక్రయించమని ప్రమాణం చేయించారు. సెబ్ ఎస్ఐ జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాల సమర్పణ

గంపలగూడెం: శ్రావణమాసం సందర్భంగా మండలంలోని ముత్యాలమ్మ ఆలయాల్లో గ్రామ దేవతకు ఆదివారం బోనాలు సమర్పించారు. గంపలగూడెం ఆలయంలో ముత్యాలమ్మకు పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక అలంకరణ చేశారు . తొలుత రేగళ్ల వీరారెడ్డి దంపతులు గ్రామరాశి బోనం సమర్పించారు. అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి పొంగలి, వంటకాలతో అమ్మవారికి నైవేద్యం పెట్టారు. తోటమూల, పెనుగొలను, అర్లపాడు, గోసవీడు, ఊటుకూరు తదితర గ్రామాల్లో గ్రామదేవతకు విశేష పూజలు జరిపారు. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గొల్లమండల యువకుడి పరిశోధనకు గుర్తింపు

తిరువూరు: ఎ.కొండూరు మండలం గొల్లమండలకు చెందిన దారావత్ భాస్కరరావు చేసిన పరిశోధన ద్వారా అంతర్జాతీయ స్థాయిలో కాపీ రైట్స్, ట్రేడ్ మార్క్ గుర్తింపునకు అర్హత సాధించారు. ఏ స్టడీ ఆన్ కస్టమర్ అవేర్నెస్ గ్రీన్ బ్యాంకింగ్ సర్వీసెస్ అంశంపై చేసిన పరిశోధనా సిద్ధాంతానికి గతంలో నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించగా, యునైటెడ్ కింగ్‌డమ్, యూరోప్ దేశాలు ఆ సిద్ధాంతానికి కాపీరైట్స్ ప్రకటించినట్లు భాస్కరరావు తెలిపారు. విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న భాస్కరరావును పలువురు అభినందించారు.

ఆదర్శప్రాయుడు సుభాష్ చంద్రబోస్

చాట్రాయి: భారత దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసి అశువులు బాసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతకు ఆదర్శమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం అన్నారు. చిన్నంపేట గ్రామంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. బోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ పోరాటాన్ని వివరించారు. సంఘం సభ్యులు కె. మహేష్, ఎం. వెంకటేశ్వరరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

ముసునూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. గోపవరం గ్రామం నాగేంద్రపురం సెంటర్‌లోని ఓ ఇంటిలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14,400 సీజ్ చేశారు. నిందితులను సోమవారం కోర్టుకు హాజరుపరుస్తారు.